చిన్నగా నవ్వి అన్నాడు సీతయ్య: "రేండే ఉత్తరాలు వచ్చాయి. అందరికన్నా చిన్నవాడికిస్తాను."

ఒక ఇన్‌లాండ్ లెటర్, ఒక కార్డు అందించాడు ఆరేళ్ళ పిల్లవాడికి.

ఉత్తరం అందుకుని రివ్వున లోపలికి పరుగెత్తాడు ఆ ఆరేళ్ళ పిల్లాడు.

సీతయ్య బయటికి రాగానే ఒకతను బయట విలబడి చూస్తున్నాడు. తనకోసమే అని గ్రహించాడు సీతయ్య వెంటనే. అతన్ని ఎప్పుడూ చూసి నట్టుగా లేదు ఎక్కడా.

"ఏం కావాలి?" అడిగాడు సీతయ్య.

"మీరేకదా ఇక్కడ పోస్ట్‌మన్?" అడిగాడు అతను.

"అవును." చెప్పాడు సీతయ్య.

"నా పేరు అహోబలరావు. కొత్తగా ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాము ఇక్కడికి, ప్రొద్దుటూరునుంచి. ఆ పచ్చమేడమీద అద్దెకి ఉంటున్నాము. నా కేమయినా ఉత్తరాలు వస్తే అక్కడ ఇవ్వండి."

"మీ కో ఉత్తరం ఉంది".

కట్ట అడుగున ఉన్న కార్డు ఒకటి తీసి ఇచ్చాడు సీత్యయ్య అహో బలరావుకి. అడ్రసు తెలియలేదు కాబట్టి అది కట్ట కిందికి తోసేశాడు.

ఎండ ఈ వేళ బాగా ఉంది అనుకుంటూ ముందుకు నడిచాడు సీతయ్య.

"సీతయ్యా, ఆగు."

పిలిచారు వెనుకనుంచి ఎవరో.

సీత్యయ్య ఆగి వెనక్కి తిరిగి తనని పిలిచినాయన్ని చూసి. చిన్నగా నవ్వాడు పలకరింపుగా.

"ఉన్నాయా?" అడిగాడు ఆయన.

"లేవు" అన్నాడు సీతయ్య నవ్వి.

"ఏమిటోయ్, ఉత్తరం లేదంటావు?" ఉత్తరం కోసం ఎదురు చూడటం అలవాటయి పోయిందోయ్ ఆ సమయానికి. ఉత్తరం వచ్చినా,

